# వంద రూపాయలు!

నాకు పెందరాడే లేవడం అలవాటు ఎంత పొద్దుపోయి పడుకున్నా సరే. ఆ రోజు కూడా అలాగే పొద్దునే లేచి కాఫీ తాగడం పూర్తిచేసి ఇంకా ఇంట్లో వాళ్ళెవరూ లేవకపోవడంవల్ల, ఇంటిముందున్న పూలకుండీల్లో వున్న పూలని చూస్తూ ఎండి రాలిపోయిన ఎండుటాకుల్ని తీసేస్తూ కూర్చున్నాను.

"గుడ్ మార్నింగ్!" అన్న గొంతు విని తిరిగి చూశాను. రాఘవరావుగారు!

ఆయన అంత పొద్దున్నే ఎందుకు మా ఇంటికొచ్చారో అర్థంకాక "ఏమిటిలా వచ్చారూ?" అన్నాను ఆశ్చర్యంగా.

"మీ ఆయన నిద్దర లేచాడా?" అన్నారు ఆయన.

"ఇంకా లేదు" అన్నాను.

"అయితే లేపు. నాకు అర్జంటు పనుంది!" అన్నారు.

అలా లేపుతున్నందుకు శ్రీవారిచేత తిట్లు తినాల్సొస్తుంది అనుకుంటూనే లేపాను.

"రాఘవరావు గారెవరు?" అని విసుక్కుంటూ లేచారాయన.

"మా ఫ్రెండ్ గిరిజా వాళ్ళ నాన్నగారు".

"అయితే నీతో మాట్లాడాలిగానీ, నాతో ఏం పని? నేనెప్పుడో ఒక్కసారే కలిసానతన్ని" అన్నారు.

"అదే నాకూ అర్థం కాలేదు. మీతోటే మాట్లాడాలట. అర్జంటుట! నిద్దర పోతున్నారంటే లేపమన్నారు" గబగబా చెప్పేసి లోపలికెళ్ళి కాఫీ తీసుకొచ్చి రాఘవరావు గారికిచ్చాను. ఈ లోగా మావారు లేచొచ్చారు.

"నువ్వు లోపలికెళ్ళమ్మాయ్!" అన్నారు అక్కడే కూర్చున్న నన్ను చూసి రాఘవరావు గారు.

ఆశ్చర్యపోతూ లోపలికెళ్ళిపోయాను. కాస్సేపటికి విసుక్కుంటూ మావారు లోపలికొచ్చి అలమారలోంచి వంద రూపాయలు తీసి అతనికిచ్చారు. వెంటనే అతను వెళ్ళిపోయారు.

"ఏం సంగతిట? అడిగాను.

"చూశావుగా! అప్పు! వంద రూపాయలు! అర్జంటుట!" అంటూ ముక్తసరిగా చెప్పారు టూత్ బ్రష్‌మీద పేస్టు వేసుకుంటూ కోపంగా.

"గిరిజ ఈ వూరొచ్చినప్పుడే ఒకసారి వాళ్ళింటి కెళతాను. లేకపోతే అసలు టచ్ లేదు"

"వాళ్ళింటికి వెళ్ళి కూడా రెండేళ్ళు దాటింది. అటువంటిది ఇంత పొద్దుటే రాఘవరావుగారు స్వయంగా వచ్చి వంద రూపాయలు అడిగారూ అంటే ఎంత అర్జంటుగా డబ్బు కావల్సొచ్చిందో పాపం" అన్నాను మా వారి సీరియస్‌నెస్ చూసి. ఆయన మాట్లాడలేదు.

"ఎప్పుడు తెచ్చిస్తానన్నారు?" మళ్ళీ అడిగాను.

"రెండు మూడు రోజుల్లో!" అంటూ కాఫీ కప్పు తీసుకుని పేపరు చదవడంలో మునిగిపోయారాయన.

రెండు మూడు రోజులేకాదు రెండు మూడు వారాలు, రెండు, మూడు నెలలు దాటిపోతున్నా రాఘవరావుగారు రాలేదు. అతని పేరు చెప్పగానే మావారు "గోవిందా . . . గోవిందా' అనేవారు. దాంతో నాకు పౌరుషంవచ్చి మా పనివాడ్ని అడగడం మొదలెట్టాను. ఎప్పుడు వాడు వెళ్ళినా రేపూమాపూ అనే సమాధానమే తప్ప మనిషి జాడలేదు.

దాంతో ఒకరోజు శ్రీవారే అన్నారు. "నీకు పుణ్యముంటుంది. వాడ్ని పంపడం మానేస్తావా? ఈపాటికి వాడికి నువ్విచ్చిన బస్సు ఛార్జీలు వెళ్ళి రావడానికి వంద దాటుంటుంది. 'ఫర్ గెటిట్" అని.

ఆ తర్వాత అతనెప్పుడో ఒక ఫంక్షన్‌లో నన్నుచూసి చూడనట్టు వెళ్ళిపోయారు, తెలీని వాళ్ళలాగా. నాకు షాక్ కొట్టింది అతని ప్రవర్తనకి.

ఒకసారి ఆయన గురించి మరో స్నేహితులతో మాట్లాడుతున్నప్పుడు ఈ ప్రస్తావన వస్తే జరిగింది చెప్పాను. అంతా విని వాళ్ళు కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు నాకు.

ఎందుకో తెలీక తెల్లమొహం వేసిన నన్నుచూసి "చూడండీ! వంద రూపాయలతో మీకూ అతనికీ చెల్లయిపోయింది. అవి మీకు తిరిగి ఇచ్చుంటే ఇంకోసారి అతనడిగినప్పుడు ఇంకా పెద్దమొత్తం కూడా ఇచ్చుండేవారు. అంతే గోవిందా! మాకలాగే జరిగింది!" అంటూ లిస్టు వర్ణించారు. ఆశ్చర్యంతో తెరుచుకున్న నా నోరు రెండు నిమిషాల వరకు మూతపడలేదు. ★